రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేపడుతున్న నాయకులు

పార్కులో అక్రమంగా మట్టి నిల్వ

- ఓ కాంట్రాక్టర్ నిర్వాకం - చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని పార్కుల పరిస్థితి రోజు రోజుకూ అధ్వానంగా తయారవుతోంది. వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కులో ఓ కాంట్రాక్టర్ అక్రమంగా మట్టిని నిల్వ చేసుకుంటున్నాడు. అధికారులు చోద్యం చూస్తుండటంతో స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

పార్కులో అక్రమంగా ఉంచిన మట్టి నిల్వ

కర్నూలు నగరాన్ని అందంగా తీర్చిదిద్దడానికి కోట్లాది రూపాయల ఖర్చు చేస్తూ ప్రజలకు ఆరోగ్యం ఆహ్లాదాన్ని పంచే విధంగా తీర్చిదిద్దుతున్నామని పాలకులు, అధికారులు చెబుతుంటే మరోవైపు కొందరు పార్కులను శిథిలం చేసి వాటిని తమ వ్యాపారానికి అడ్డాగా చేసుకొని ఆదాయాన్ని సంపాదించుకుంటున్నారు. అధికార పార్టీ అండదండలు సంపూర్ణంగా ఉన్నాయనే ధీమాతో ఓ కాంట్రాక్టర్ వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కును అడ్డాగా మార్చుకున్నాడు. తన పనుల కోసం ఆ పార్కును డంపుగా మార్చుకొని అందులో కంకర, ఇసుక, నల్ల మట్టి, వృధా మట్టి లాంటివి తెచ్చి అక్కడ వేసి వాటిని తన అవసరానికి వాడుకుంటున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా చోద్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సుందరయ్య పార్కులో సుమారు రూ.నాలుగు కోట్లు విలువ చేసే పుష్కరాల సమయంలో వాడిని పైపులను పెట్టారు. అగ్నిప్రమాదంలో ఆ పైపులు కాలిపోయాయి. అందుకు సంబంధించి కౌన్సిల్లో వాటి వివరాలు కావాలని, ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అందుకు బాధ్యులు ఎవరు? ఎవరు కాల్చారు తెలుసా అని ఓ కార్పొరేటర్ అడగగా కమిటీని వేసి నిగ్గు తేలుస్తామని, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంతవరకు ఆ కమిటీ లో ఉన్న అధికారులు మారిపోయారు. ఇప్పటివరకు దానీ ఊసే లేదు. కార్పొరేషన్‌లో కమిషనర్‌గా ఐఎఎస్ అధికారి ఉన్నప్పటికీ ఆ విషయాన్ని నిగ్గు తెల్చడంలో రాజకీయ నాయకుల ఒత్తిడితో ఏమీ చేయలేని స్థితిలో గమ్మున ఉండిపోయారు. పార్కుకు సుందరయ్య పార్క్ అని నామకరణం చేసి ఆయనను అవమాన పరుస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే పార్కు స్థలం ఇతరులకు లీజుకు ఇచ్చిన కార్పొరేషనుకు ఆదాయం వచ్చేది. అక్రమంగా మట్టిని నిల్వ చేసుకుంటున్న కాంట్రాక్టర్ కార్పొరేటర్‌కు బంధువుకావడం విశేషం. ఆ పార్కు వీకర్ సెక్షన్ కాలనీలో ఉండటం చేతనే ఆ పార్కును అభివృద్ధి చేయకుండా నిలిపివేసినట్లు ఆ ప్రాంత ప్రజలు అనుకుంటున్నారు. ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో పార్కులను సుందరంగా తీర్చిదిద్దుకుంటూ ప్రజలకు ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని పంచుతుంటే ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం వహిస్తే ఆ ప్రాంత ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతామని చెబుతున్నారు. మరో వైపు పార్కుకు ప్రహరీగోడ లేకపోవడంతో కొందరు ఆకతాయిలకు పార్కు అడ్డాగా మారింది. మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నారు. పార్కును పరిరక్షించాల్సిన అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో వర్షపు నీరు నిలుస్తోందని మట్టి వేస్తున్నట్లు సదరు కాంట్రాక్టర్ అంటున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి

గతంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆ పార్కుకు సుందరయ్య పార్కుగా నామకరణం చేసి ప్రారంభించారు. కానీ ఆలనా పాలన చూడకుండా ఆ పార్కును అనాధలా వదిలేయడంతో చుట్టూ కాంపౌండ్‌కు ఉన్న కడ్డీలను ఆకతాయిలు తీసుకువెళ్లి పాత సామానుకు అమ్ముకోవడం, వృధాగా పడిందనే నెపంతో పుష్కరాలకు సంబంధించిన పైపులు తెచ్చి అక్కడ పెట్టడం, ఆ పైపులు కాలిపోవడం లాంటివి జరిగిన సంగతి అందరికీ విధితమే. ఒక కాంట్రాక్టర్ ఆ పార్కులో ఇసుక, మట్టి, కంకర లాంటివి నింపి తన స్వార్థానికి వాడుకుంటున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారంటే ఆ కాంట్రాక్టర్ నుండి ఎంతో కొంత అధికారులకు ముడుతుందని చెప్పవచ్చు. స్వాతంత్ర సమరయోధుడి పేరు ఉన్న సుందరయ్య పార్కును కమిషనర్ వెంటనే పరిశీలించి పార్కును అభివృద్ధి చేసి అక్కడి ప్రజలకు ఆరోగ్యాన్ని ఆహ్లాదాన్ని పంచాలి. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీగా ధర్నా చేయాల్సి వస్తుంది.

- టి.రాముడు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి.

టెండర్లు పిలిచాం

వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కును అభివృద్ధి చేసేందుకు టెండర్లను పిలిచాం. త్వరలో ఆ పార్కును అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, మున్సిపల్ కార్పొరేషన్ డిఈ.

కర్నూలు నుంచి

విజయవాడకు రైలు నడపాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు నగరం నుంచి విజయవాడకు రోజూ రైలు నడపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. కర్నూలు నుంచి విజయవాడకు రైలు నడపాలని, కర్నూలులో రైల్వే వ్యాగన్ వర్క్ షాపును వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని, రైల్వే ప్రయివేటీకరణను ఆపాలని కర్నూలు రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కర్నూలు నగరం నుంచి విజయవాడకు వెళ్లే వారి సంఖ్య పెరిగిందని తెలిపారు. కర్నూలు నగరం నుంచి విజయవాడకు రైలు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కర్నూలు నగరం నుంచి విజయవాడకు రైలు నడపాలని కోరారు. అలాగే కర్నూలు నగరం నుంచి మచిలీపట్నం రైలును కూడా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాపును త్వరగా పూర్తి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే రంగాన్ని ప్రయివేటీకరించడానికి పూనుకున్నారని విమర్శించారు. ఇప్పటికే 150 రైల్వే స్టేషన్లను, 400 వరకు రైళ్లను ప్రయివేట్ వారికి అప్పగించడానికి ప్రతిపాదనలు చేశారని తెలిపారు. రైల్వే రంగాన్ని ప్రయివేటీకరించడం వల్ల సామాన్యులు ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యం కలిగిన రవాణా రంగం రైల్వే రంగమని, ప్రపంచంలోనే ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తున్న రంగం భారత రైల్వే రంగమని తెలిపారు. ప్రజలకు 47 శాతం రాయితీస్తూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి దాదాపు రోజుకు మూడు కోట్ల మందిని చేరవేస్తున్న రైల్వే రంగాన్ని నిర్వీర్యం చేయడానికి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రైల్వే రంగ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా స్థాయిలో పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రైల్వే రంగంలో 3 లక్షల మంది పనిచేసేవారని, ప్రస్తుతం 2 లక్షలకు తగ్గిందన్నారు. సిబ్బంది తగ్గడం వల్ల పనిభారం పెరిగి రైల్వే ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే రంగాన్ని ప్రయివేటీకరించే విధానాలు మానుకోవాలని కోరారు. అనంతరం రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు టి.రాముడు, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, సిఐటియు నగర నాయకులు సుధాకరప్ప, ప్రభాకర్, మహమ్మద్ రఫీ, ఏసు, ఆటో వర్కర్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల

ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని స్థానిక ఉస్మానియా కళాశాలలో గురువారం స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ కర్నూల్ ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్ ఖాన్ ప్రారంభించారు. భారత స్వాతంత్ర సంగ్రామంలో పోరాడిన స్వాతంత్ర సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొందరు కుటుంబాలను పోగొట్టుకుంటే ,మరికొందరు తమ ఆస్తిపాస్తులన్నింటిని దేశం కోసం త్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలను సేకరించడంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ కృషి ప్రశంసనీయమైనదని తెలిపారు. సయ్యద్ నశీర్ అహ్మద్ మాట్లాడుతూ తాను కేవలం 310 మంది ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు వారి చరిత్రను మాత్రమే సేకరించగలిగానని కళాశాల కార్యదర్శి , కరస్పాండెంట్ అజ్రాజావేద్ అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ , సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ , చరిత్ర శాఖాధ్యక్షులు షేక్ మసూద్ అహ్మద్, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్ఎం.గులాం హుస్సేన్ , ఉస్మానియా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎం. ఘజనీ, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ ఎ.కరీముల్లా ఖాన్ మొదలైన వారు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

అప్పుల బాధతో

యువ రైతు ఆత్మహత్య

- వలస వెళ్లిన భార్యాపిల్లలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని అలసందగుత్తి గ్రామంలో యువ రైతు లడ్డు సోమేష్ (34) అప్పుల బాధతో తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు లడ్డు సోమేష్‌కు 1.50 ఎకరాల పొలం ఉంది. అదనంగా 10 ఎకరాలను కౌలుకు చేసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించే వారు. గత రెండేళ్లుగా కరువు సంభవించడంతో తీవ్రంగా నష్టపోయారు. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టినా దిగుబడులు రాకపోవడంతో అప్పులు పెరిగాయి. నెల క్రితం భార్య, పిల్లలు వలస వెళ్లారు. భార్య పిల్లలు ఇప్పటికీ వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. మృతుడు వడ్డీలు కట్టలేక మనోవేదనకు గురయ్యారు. మృతునికి దాదాపు రూ.10 లక్షల అప్పు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం అప్పుల బాధ తాళలేక తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతునికి భార్య మునేశ్వరి, కుమారుడు విష్ణు, కుమార్తె తులసి ఉన్నారు.

కల్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ

- 446 జంటలకు రూ.3.72 కోట్లు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా జిల్లాలో 446 జంటలకు రూ.3.72 కోట్ల లబ్ది చేకూరినట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం వైఎస్ఆర్ కళ్యాణమస్తు షాది తోఫా ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బివై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం ద్వారా జులై నుంచి సెప్టెంబర్ 2023 త్రైమాసికంలో నూతనంగా వివాహం చేసుకున్న మొత్తం 446 మంది లబ్ధిదారులు (బీసిలు - 167 (ఒక్కటే కులం - 159, కులాంతర వివాహం - 8) , విభిన్న ప్రతిభావంతులు - 4, మైనారిటీస్ - 83(ఒక్కటే కులం - 81, కులాంతర వివాహం - 2), ఎస్సీ - 184 (ఒక్కటే కులం - 183, కులాంతర వివాహం - 1), ఎస్టీ - 8 మంది లబ్ధి పొందే కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సలీమ్ బాషా, సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మి దేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న జెసి, మేయర్, ఎమ్మెల్యే

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్, మేయర్ రామయ్య అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని స్థానిక 13 వ వార్డు పరిధిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వారు ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అన్ని రకాల పరికరాలు వైద్య సిబ్బంది ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు, విజయలక్ష్మి, యూనస్, కో ఆప్షన్ మెంబర్స్ నయీమ్, నవీన్, నాయకులు గోపి, సురేష్ పాల్గొన్నారు.

సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్

క్రీడలలో కూడా రాణించాలి : ఎంపి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్ సూచించారు. గురువారం కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో నవీకరించిన సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బివై.రామయ్య, స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ రమణ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు ఎంపి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో కూడా మంచి ర్యాంకులు సాధించాలని క్రీడలు మనిషికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయన్నారు. స్పోర్ట్స్‌ను ఆడుకోకుండా ఉండడం చేత మన ఇండియాలో బిపిలు, షుగర్లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రస్తుత భారతదేశంలో రక్తదానం చేయాలంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో 20 శాతం మంది రక్త దానం చేయడానికి కూడా అర్హత లేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి కర్నూలుకు తలమానికంగా ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డి ఇ సుదర్శన్ బాబు, చీఫ్ కోచర్ శ్రీనివాసులు, స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయం సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో విఫలం

డిసిసి అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళా సాధికారతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు విమర్శించారు. గురువారం డిసిసి కార్యాలయంలో జిల్లా సేవాదళ్ మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. బాబురావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, రాయితీ రుణాలు, రైతులకు రుణమాఫీ, మొదలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో ఇప్పటికే అమలులో ఉన్నాయన్నారు. అనంతరం వెంకటసుజాత ఆధ్వర్యంలో 60 మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సిహెచ్ బజారన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.ప్రమీల, డిసిసి కార్యదర్శి లాజరస్, సిటీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు డబ్ల్యు.సత్యరాజు మహిళలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం : కర్నూలు జిల్లాలోని పాణ్యం నియోజక వర్గంలో జగనన్న విద్యాదీవెన పథకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్న సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ్ లు కలిసి ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామం , కల్లూరు మండలం లక్ష్మీ పురం గ్రామాలను గురువారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ముఖ్యమంత్రి హెలిప్యాడ్, సభాస్థలం, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , ఇతర భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పటిష్ఠ భద్రతకు పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి మాట్లాడారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సంయుక్తంగా రెవిన్యూ , పోలీసులు ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్‌పి విజయ శేఖర్ , స్పెషల్ బ్రాంచ్ సిఐలు ప్రసాద్, శ్రీనివాస రెడ్డి, నాగరాజ్ యాదవ్, కర్నూలు రూరల్ సర్కిల్ సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఓర్వకల్లు ఎస్ఐ రాజా రెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి, జెసి

స్కూల్ గ్రాంట్స్ విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రాంట్స్ విడుదల చేసి, నాన్ టీచింగ్ సిబ్బందిని కేటాయించాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. గురువారం డిఇఒను రంగప్ప, కర్నూలు మండల కార్యదర్శి అంజి కలిసి వినతిపత్రం సమర్పించారు. నాడు నేడు పేరుతో స్కూళ్లకు నిధులు కేటాయించి భవనాలు నిర్మించడంలో ఉన్న శ్రద్ధ స్కూల్ నిర్మాణానికి గ్రాంట్స్ విడుదల చేయడంలో లేదని విమర్శించారు. స్కూల్ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం స్కూల్ గ్రాంట్ ఇచ్చేవారని, కానీ ఈ సంవత్సరం ఇవ్వకపోవడంతో హెచ్ఎంలు టీచర్లు సొంత డబ్బుతో కరెంట్ బిల్లులు చాక్ పీసులు ఇతర సామాగ్రి కొనుక్కోవడం కోసం ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. కానీ వెంటనే స్కూల్ గ్రాంట్స్ నిధులను విడుదల చేసి క్లర్కులను కూడా నియమించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల కోసం వెండర్ పార్కింగ్ జోన్లు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకు వెండర్ పార్కింగ్ జోన్ ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర్ నగర మేయర్ బివై.రామయ్య, చిరు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుత్తి పెట్రోల్ బంక్ సమీప ఫ్లైఓవర్ కింద రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన వెండర్ పార్కింగ్ జోన్లను పాణ్యం ఎమ్మెల్యే, మేయర్, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని సరికొత్త హంగులతో తీర్చిదిద్దుతున్నామని అన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పార్కుజోన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మహా నగరాలకే పరిమితమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు నగరంలో జరుగుతున్నాయన్నారు. చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బ తినకుండా, వారి వల్ల ట్రాఫిక్‌కి ఇబ్బంది కలుగకుండా నిరుపయోగ ప్రదేశంలో మంచి ఉద్దేశ్యంతో ఈ జోన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వినూత్న ఆలోచనలతో నగరాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, గాజుల శ్వేతా రెడ్డి, వైజ అరుణ, దండు లక్ష్మీకాంత రెడ్డి, కాశపోగు జయరాముడు, మునిసిపల్ అధికారులు ఎస్ఇ, వేణుగోపాల్, ఎంఇ షాకీర్, డిఇఇ గోపాలకృష్ణ, ఎంఇ భాను, సింగల్ విండో ప్రెసిడెంట్ పందిపాడు శివశంకర్ రెడ్డి, ఎద్దుల శివారెడ్డి, వైజా బాలచంద్రారెడ్డి, పిడిబాష, ఆలంబాష, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెండర్ పార్కింగు జోన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

ప్రాజెక్టులపై వివక్ష తగదు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు వివక్షత చూపిస్తున్నాయని రాయలసీమ రాష్ట్ర ఉద్యమ నాయకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రశ్నించారు. గురువారం మీడియా పాయింట్ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంపై దృష్టి సారించి అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలను కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారమివ్వాలి

- క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి పరిశీలనతోనే అది సాధ్యమవుతుందని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో 24 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని, 2.80 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు 3.50 లక్షల మంది రైతులు నష్టపోయినట్లు ప్రభుత్వం అంచనా వేసినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించకుండా ఈక్రాపు, ఇకెవైసి ఆధారంగా పంట నష్టాన్ని గుర్తిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. దీనివలన సుమారు 50 వేల మంది రైతులు పంట నష్ట పరిహారానికి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ , రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి నష్టపోయిన రైతులందరినీ గుర్తించి వారినందరినీ మాన్యువల్ లో నమోదు చేసి పంట నష్టపరిహారం నివేదికను ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ పంట నమోదు కాని పంటలను నమోదు చేయలేమని చెప్పడం రైతులకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. 2023 ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ ఎండిపోయి పాసివేసిన పరిస్థితి ఉన్న విషయం వ్యవసాయ శాఖ ,రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ కుతెలిసిన విషయమేనన్నారు. కాబట్టి క్షుణ్ణంగా పరిశీలించి ఆవేదన, ఆందోళన, దుర్భర పరిస్థితుల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలని, వ్యవసాయ కూలీలను వలసలు ఆపేందుకు తక్షణమే ఉపాధి పనులు ప్రారంభించాలని, పశువులకు పశుగ్రాసం అందించాలని, రైతుల అన్ని రకాల పంట రుణాలను రద్దు చేయాలని కోరారు.

మారందొడ్డిలో పేరుకున్న పాచినీరే దిక్కు

పట్టించుకోని సర్పంచి, అధికారులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం మారందొడ్డిలో ప్రజలకు తాగునీటి పథకాలన్నీ పేరుకున్న పాచినీరే దిక్కుగా అయ్యింది .నెలలుగా ట్యాంకులను శుభ్రపరచే వారులేక, చుట్టూ అపరిశుభ్రత నడుమనే నీటిని తెచ్చుకోవడం ఇబ్బందికరంగా మారింది. 30 రోజులకోమారు ట్యాంకులు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లించి పారిశుధ్యంపై శ్రద్ధ చూపాల్సి ఉండగా ఈ గ్రామంలో మాత్రం నెలలుగా చర్యలు చేపట్టినట్లు కానరావడం లేదు. ఇక్కడి అధికారులు, గ్రామ సర్పంచి పట్టించుకోని ఫలితంగా పేరుకున్న పాచినీరు తెచ్చుకొని తప్పనిసరిగా తాగుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న వేళ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

గ్రంథాలయ భవన ఆధునీకరణకు చర్యలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్

ప్రజాశక్తి - గోనెగండ్ల

రికార్డులను పరిశీలిస్తున్న సుభాష్ చంద్రబోస్

గోనెగండ్లలోని గ్రంథాలయ భవన ఆధునీకీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. గురువారం శాఖ గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠకులు, విద్యార్థులు, యువత నుంచి డిమాండ్ ఉన్న పుస్తకాల వివరాలను తెలియజేస్తే వాటిని గ్రంథాలయానికి తెప్పించి ఇస్తామన్నారు. గ్రంథాలయంలో టాయిలెట్ల సమస్య ఎదుర్కొంటున్నామని, సౌకర్యాల గురించి కొంతమంది పాఠకులు ఛైర్మన్‌కు వివరించారు. గ్రంథాలయ భవనాన్ని ఆధునీకరించేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాఖ గ్రంథాలయ అధికారి గిరిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- సర్పంచి సావిత్రి, అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

'జగనన్నకు చెబుదాం' పాల్గొన్న సర్పంచి, అధికారులు

గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం'ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచి కరివేముల సావిత్రి, ఇఒఆర్‌డి టి.బాలన్న తెలిపారు. గురువారం మండలంలోని బెల్డోన గ్రామంలో సర్పంచి సావిత్రి ఆధ్వర్యంలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే దరఖాస్తులను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని చెప్పారు. వైసిపి నాయకులు కరివేముల గోవిందు, గోవర్ధన, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంఇఒ సావిత్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, పంచాయతీరాజ్ ఎఇ సోలా రెడ్డి, ఎపిఎం నాగార్జున, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఎఇఒ రమాదేవి, హౌసింగ్ అధికారి భవ్య, రెవెన్యూ కార్యదర్శి పెద్దన్న పాల్గొన్నారు.

జడ్జికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - ఆదోని

జడ్జిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదోని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్‌గా పని చేస్తూ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వెళ్తున్న వీరనాగ వెంకట లక్ష్మీని ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. గురువారం ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనితా బాయి ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు. న్యాయమూర్తి వెంకట లక్ష్మీ మాట్లాడుతూ... మూడేళ్లుగా ఆదోని అసోసియేషన్ అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించిందని, ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలని గుర్తు చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంజినప్ప, లావణ్య, సవితా రాణి, సీనియర్ న్యాయవాదులు మన్సూర్ అహ్మద్, హాజీ, గిరిధర్, బద్రినాథ్, శివకుమార్ స్వామి, ఇస్మాయిల్, హుస్సేన్ సాని, లతీఫ్ అహ్మద్, సన్నీ, మధు, కశ్యప్, షబాస్ అహ్మద్ పాల్గొన్నారు.

'నారాయణ'లో ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

పట్టణంలోని నారాయణ ఈ-టెక్నో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ-కిడ్స్ విభాగంలోని విద్యార్థులు గురువారం స్పోర్ట్స్ ప్రీమియర్ లీగ్ మీట్‌ను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెట్ సీమ ఎలియ్యాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చదువుతోపాటు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. నారాయణ విద్యా సంస్థల ఎజిఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆటల పోటీల్లో పాల్గొని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలని సూచించారు. స్పోర్ట్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్ఐ.కొండలరావు, సిబిఎస్ఇ బ్రాంచి ఆర్ఐ అన్వర్, కోఆర్డినేటర్ అరుణ, ప్రిన్సిపల్ జాఫర్, వైస్ ప్రిన్సిపల్ జేబా పాల్గొన్నారు.

గుడిని మింగే దొంగలు..!

- హుండీ ఆదాయంపై పెత్తందారుల కన్ను
- హుండీ నగదు చోరీ - పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మారెమ్మ దేవాలయం

మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో వెలసిన శ్రీమారెమ్మ దేవాలయం హుండీ ఆదాయంపై పెత్తందారులు కన్ను వేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. హుండీలోని నగదు చోరీకి గురైనా పోలీసులు పట్టించుకోవడం లేదని వినికిడి. ఆలయంలోని హుండీలో భక్తులు కానుకల రూపంలో నగదు, బంగారు, వెండి వేస్తుంటారు. టిఎస్.కూలూరు, కనకవీడు, నాగలదిన్నె, పేట, దైవందిన్నె, పొనకలదిన్నె, సోమలగూడూరు, ఏనుగుబాల, కంపాడు, సి.బెళగల్, అల్వాల తదితర గ్రామాల నుంచి తిమాపురం మీదుగా పనుల నిమిత్తం రోజూ ఎమ్మిగనూరుకు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో తిమాపురం గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయం హుండీలో భక్తులు కానుకలను వేస్తారు. మూడు నెలలకోసారి హుండీ నిండుతోంది. హుండీ లెక్కింపు చేపట్టినప్పుడల్లా దాదాపు రూ.3 లక్షల నగదు వస్తున్నట్లు సమాచారం. ఏడాదికి నాలుగు సార్లు హుండీని లెక్కిస్తారు. ఏడాదికి హుండీ ఆదాయం రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు జమ అవుతుంది.

హుండీ ఆదాయంపై గ్రామ పెత్తందారుల కన్ను

కురువ బొంతల వంశస్తులు గొర్రెల కాపరులుగా ఉన్న కాలంలో గ్రామ దేవత శ్రీమారెమ్మను గుర్తించి చిన్న దేవాలయం నిర్మించారు. నాటి నుంచి కురువ బొంతల వంశస్తులు గుడి ధర్మకర్తలుగా ఉంటున్నారు. హుండీ ఆదాయం దాదాపు రూ.కోటితో మారెమ్మ దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో నిర్మించారు. ఏడాదికి రూ.12 నుంచి రూ.15 లక్షలు హుండీ ఆదాయం వస్తుండడంతో గ్రామ పెత్తందారుల కన్ను పడింది. ఆలయ అభివృద్ధి కమిటీ పేరుతో ముందుగా దేవాలయ ధర్మకర్తల వంశస్తులను కమిటీలోకి తీసుకోకుండా దౌర్జన్యంగా అడ్డుకున్నారు. దేవాలయం పూర్తిగా గ్రామ పెత్తందారుల చేతుల్లోకి వెళ్లింది. మూడేళ్ల నుంచి ఆలయ హుండీ ఆదాయం, ప్రతేడాది ఉగాదికి జరిగే మారెమ్మ దేవర సందర్భంగా వచ్చే ఆదాయాలకు సంబంధించిన వివరాలను గ్రామస్తులకు తెలపకుండా పెత్తందారులు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. జూన్ 17న దేవాలయం లోపల ఏర్పాటు చేసిన హుండీ దొంగతనం జరిగింది. ఈ విషయం టివి ఛానెళ్లలో సైతం ప్రసారమైంది. ఇప్పటికీ పోలీసులు నిందితులను తేల్చలేక పోతున్నారు. హుండీలో రూ.3 లక్షల వరకు నగదు ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. రూ.15 వేల దొంగతనం జరిగిందని పోలీసులు రాసుకున్నట్లు సమాచారం. హుండీ దొంగ తనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన కొంతమంది గ్రామస్తులపై అధికార పార్టీ నాయకుల అండదండలతో కౌంటర్ కేసులు పెట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని భక్తులు చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ చేపట్టి నిందితులను తేల్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హుండీలో దొంగలించిన నగదును రికవరీ చేయాలని, గ్రామంలోని అన్ని కులాల పెద్దలతో సమిష్టిగా దేవాలయం అభివృద్ధి కోసం కమిటీని నియమించాలని భక్తులు కోరుతున్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

- గొర్ల సోమన్న, తిమ్మాపురం గ్రామం

తిమ్మాపురం గ్రామంలోని మారెమ్మ దేవాలయం నియోజకవర్గంలోనే అత్యధిక ఆదాయం కలిగిన ఆలయంగా పేరు ఉంది. ఇలాంటి దేవాలయంలో హుండీ దొంగతనం జరగడం దురదృష్టకరం. దొంగతనం చేసిన నిందితులను అరెస్టు చేసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం

- కెటి.ఉరుకుందు, తిమ్మాపురం గ్రామం

మారెమ్మ ఆలయం హుండీలో నగదు దొంగతనం జరిగిందని గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఎమ్మెల్యే అల్లుడు చెప్పారని గ్రామంలోని అమాయకుల చేత నీటి కుళాయి పైపులైన్ వేయిస్తామని సంతకాలు పెట్టించుకుని గ్రామీణ పోలీసు స్టేషన్‌లోనే ఫిర్యాదు చేశారు. గ్రామీణ పోలీసులు నిందితులను అరెస్టు చేయాలి. ఎమ్మెల్యే అల్లుడు చెప్పారని తప్పుదోవ పట్టించడం పద్ధతి కాదు.

రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు ఉంటుంది

- నాగేష్, తిమ్మాపురం గ్రామం

దొంగతనం జరిగే మూడు నెలల కావస్తున్నా పోలీసులు నిందితులను పటుకోలేకపోతున్నారు. హుండీలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు నగదు ఉండే అవకాశం ఉంది. రూ.15 వేలు ఎప్పుడూ ఉండదు. రూ.15 వేలు మాత్రమే హుండీలో ఉంటుందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చూపడం ఆశ్చర్యం.

సరైన రక్షణ లేదు

- నాగరాజు, తిమ్మాపురం గ్రామం

దేవాలయానికి సరైన రక్షణ లేదు. దేవాలయ కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి దొంగతనాలు పురావృతం కాకుండా చూడాలి.

రూ.10 వేలు రికవరి చేశాం

- నిరంజన్ రెడ్డి, గ్రామీణ ఎస్ఐ, ఎమ్మిగనూరు

తిమ్మాపురం గ్రామంలో మారెమ్మ గుడి హుండీలో దొంగతనం జరిగిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నేను గ్రామాన్ని సందర్శించి, హుండీలను సీజ్ చేశాను. రూ.10 వేలు రికవరీ చేశాను.

ఆలయ అభివృద్ధి ఎలా..?

- బొంతల ఈరన్న, తిమ్మాపురం గ్రామం

తిమ్మాపురం గ్రామంలో శ్రీమారెమ్మ దేవాలయం వెలసినప్పటి నుంచి మా పెద్దలు, మేము సంరక్షకులుగా ఉన్నాం. ఇప్పుడున్న పెద్దలు మమ్మల్ని పక్కన పెట్టి దేవాలయాన్ని వారి చేతుల్లోకి తీసుకున్నారు. ఆలయంలో దొంగతనం జరిగినా పట్టించుకోవడం లేదు. పోలీసు స్టేషన్‌లో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా రూ.10 వేలు రికవరీ చేశామని చెప్పి చేతులు దులుపుకున్నారు. గ్రామస్తులు, పెద్దలు, ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎవరి ప్రభుత్వం ఉంటే వారు పరిపాలించుకోండని అధికారులు చెబుతున్నారు. ఇలా ఉంటే దేవాలయం ఎలా అభివృద్ధి చెందుతుంది.

రైల్వే ప్రయివేటీకరణను ఆపాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

రైల్వే ప్రయివేటీకరణను ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న, వ్యకాస జిల్లా నాయకులు లింగన్న డిమాండ్ చేశారు. గురువారం ఆదోని రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైల్వే ప్రయివేటీకరణ వల్ల కార్పొరేట్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైల్వే ప్రయివేటీకరణతో యువత ఉపాధి అవకాశాలు కోల్పోతారని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో యువత ఉపాధి కోల్పోయి తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని చెప్పారు. లాభాలు ఆర్జించే రైల్వేను మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అతి పెద్దదైన రైల్వే రంగాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాయచూర్ నుంచి కాకినాడ వరకు, గుల్బర్గా ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. విజయవాడకు ప్రత్యేకంగా రైలు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్టేషన్‌లో 4వ నెంబర్ ఫ్లాట్ ఫారంలో డిస్‌ప్లే బోర్డును సరి చేయాలని తెలిపారు. స్త్రీలకు మురుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రైల్వే ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్బాల్, రామప్ప, బాష, హనుమంతు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. **కోసిగి** మండల కమిటీ ఆధ్వర్యంలో కోసిగి రైల్వే స్టేషన్ మాస్టర్ కౌశల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, వీరేష్ మాట్లాడారు. రద్దయిన పలు రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్, రామకృష్ణ, రామాంజనేయులు, గోపాల్, చిన్నారెడ్డి, దిద్దిరామయ్య, కర్రెప్ప, మహేష్, వినోద్, శరత్, పవన్, కైఫ్, ముజీబ్, ఇస్మాయిల్, సోహిబ్ పాల్గొన్నారు.

ఆదోని స్టేషన్ మాస్టర్ వెంకటేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉమ్మడి మేనిఫెస్టోను అమలు చేస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

గత టిడిపి ప్రభుత్వంలో ఉన్న సంక్షేమాన్ని, అభివృద్ధిని కొనసాగిస్తూ టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను అమలు చేస్తామని టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని చాగీ గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకే రంగులు మారుస్తూ ఊసరవెల్లిలా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికుట్రలు పన్నినా 2024లో మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రామస్వామి, రంగస్వామి నాయుడు, బుద్ధారెడ్డి, అయ్యప్ప రెడ్డి, రామకృష్ణ, మండల అధ్యక్షులు బసవరాజు, నాగరాజు, చాగీ మల్లికార్జున రెడ్డి, నాగప్ప, విశ్వనాథ్ గౌడ్, శేఖర్, నర్సప్ప, రఘు, మదిరె వీరేష్, రాము, గుళ్లి, చక్రి, రమేష్, నాగరాజ్, భీమ లింగ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

కొత్తగా ఎన్నికైన కార్యవర్గం

విద్యారంగ సమస్యలపై పోరాటం

- ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. గురువారం ఎస్సీ హాస్టల్ ఆవరణలో జరిగిన 6వ పట్టణ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించే వరకు పోరాడతామని తెలిపారు. నూతన విద్యా విధానానికి, ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఆదోనిలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యవర్గం తెలిపింది. గౌస్, కార్యదర్శి శ్రీనివాసులు, రాజు, గణేష్, రాజు, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా గౌస్, పట్టణ కార్యదర్శిగా శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులుగా దినేష్, పవన్, నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శులుగా శశిధర్, గణేష్, సూరితోపాటు 10 మందిని కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్యాలయానికి స్థలం కేటాయించండి

- తహశీల్దార్‌కు ఎపిఎన్‌జిఒస్ వినతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ ఎపిఎన్‌జిఒస్ అసోసియేషన్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కార్యాలయం కోసం పట్టణంలో స్థలం కేటాయించాలని ఎపిఎన్‌జిఒస్ తాలూకా అధ్యక్షులు బాలకృష్ణ కోరారు. గురువారం తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆలూరులో కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరారు. ఉద్యోగులు బసన్నగౌడ్, అశోక్, వెంకటేశ్వర్లు, దిల్ నవాజ్ బేగం, గాదిలింగ పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణానికి కర్నూలుకు చెందిన కె.నాగ ప్రదీప్, కిరణ్మయి ఆచారి రూ.1,00,116 విరాళంగా చెల్లించారని దేవాలయ సూపరింటెండెంట్ జెకె.మల్లికార్జున తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించినట్లు తెలిపారు. బాండు పేపర్ అందించి, పూలమాలతో సన్మానించినట్లు చెప్పారు. దేవాలయ సిబ్బంది మల్లి పాల్గొన్నారు.

గోనెగండ్లలో రాష్ట్రస్థాయి మహిళ కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 29, 30, డిసెంబర్ 1న గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో కీర్తిశేషులు మేకల పెద్ద రంగస్వామి స్మారక 70వ మహిళ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుబేర నాయుడు, జాకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కబడ్డీ పోటీల్లో 13 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు, 50 మంది నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించామని చెప్పారు. కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించ నున్నామని తెలిపారు. భాస్కర్ రెడ్డి, మన్సూర్, రామన్, దేవేంద్ర, ఇస్మాయిల్, కరెంటు మాబు హుస్సేన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుబేర నాయుడు

పీఠాధిపతులతో చర్చిస్తున్న భక్తుడు

రాఘవేంద్రుని ప్రతిమ ఏర్పాటుపై పీఠాధిపతులతో చర్చలు

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రాఘవేంద్రస్వామి 253 అడుగుల ప్రతిమపై ఫౌండేషన్ వ్యవస్థాపకులు, భక్తుడు సురేష్ పీఠాధిపతులతో చర్చించారు. గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంత్రాలయానికి వచ్చిన ఆయన దర్శన అనంతరం పీఠాధిపతులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, మైసూరుకు మధ్యలో ఉన్న రాంనగర్‌లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.300 కోట్లతో రాఘవేంద్రస్వామి రూపాన్ని ఫ్యాక్టరీ వస్తువులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూమి పూజ నిర్వహణకు పీఠాధిపతులను ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తేదీని ఖరారు చేసుకోవాలని సూచించారు. మూడేళ్లలోపు ఈ కార్యాన్ని పూర్తి చేయాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు సురేష్‌కు శేషవస్త్రం అందజేసి ఆశీర్వదించారు. బోరలింగయ్య, హేమంత్ కుమార్, గిరీష్ ఉన్నారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు

కౌతాళం : కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గురువారం పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం, మట్కా, జూదంపై ప్రత్యేక దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'గడపగడపకు' ద్వారా ప్రజలకు చేరువ

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపడుతున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా ప్రజలకు చేరువ అవుతున్నామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బల్లేకల్ గ్రామంలో రెండో రోజూ 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజలకు మొత్తం రూ.17,85,40,000 నేరుగా ప్రజల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. సచివాలయ నిధుల ద్వారా రూ.20 లక్షలతో డ్రెయినేజీ, కాలువలు, సిసి రోడ్ల పనులకు అంచనా వేసినట్లు తెలిపారు. గ్రామంలో 60 నివాస పట్టాలు, కొత్త విద్యుత్ స్తంభాలు 30 మంజూరు, కొత్త విద్యుత్ స్తంభాలు, ప్రతి ఇంటికీ కుళాయి వేసేందుకు రూ.10 కోట్లతో జల జీవన్ పథకం ద్వారా పైపులైన్ వేసేందుకు టెండర్ పిలిచినట్లు చెప్పారు. రూ.1.20 కోట్లతో జడ్‌పి స్కూల్ నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపిడిఒ గీతావాణి, ఎపిఒ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగమల్లయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, సర్పంచి లోకేష్, ఎంపిటిసి దేవికమ్మ, మండల అధ్యక్షులు గురునాథ్ రెడ్డి పాల్గొన్నారు. **ఆదోని**లోని 26వ వార్డులో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు రియాజ్ అహ్మద్ మాట్లాడారు. దళారి వ్యవస్థ ఉండకూడదని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు వేస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు తెలిపారు. వైసిపి కొత్త మేనిఫెస్టో మార్చిలో విడుదల చేస్తారన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, కౌన్సిలర్ సైదానిబీ, హాజీ బాష, నూర్ బాష, రహీం, మెహబూబ్ బాయ్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని నల్లచెలిమల గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథక బోర్డును ఆవిష్కరించారు. వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, ఎంపిపి భర్త లుముంబా, జెసిఎస్ మండల కోఆర్డినేటర్ రాజారెడ్డిలు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి రాముడు, వైసిపి నాయకులు రామచంద్ర, వీరేష్, మద్దిలేటి, రాజశేఖర్ పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని హర్ధగేరి గ్రామంలో మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. జడ్‌పిటిసి లింగప్ప మాట్లాడారు. హర్ధగేరి గ్రామానికి రూ.11.60 కోట్లు అందించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్ అందించారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, సొసైటీ ఛైర్మన్ సీనప్ప, రాష్ట్ర కార్యదర్శి కె.జనార్ధన్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ రంజిత్, రాజశేఖర్, సర్పంచి హరి గురునాథ్ రెడ్డి, తిప్పారెడ్డి, ఎంపిపి భర్త పరిసి, లక్ష్మన్న పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని 52 బసాపురం గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి పాల్గొన్నారు.

ఆదోనిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న శాంత

దేవనకొండలో మాట్లాడుతున్న మల్లికార్జున

హాలహర్విలో మాట్లాడుతున్న మల్లికార్జున

మంత్రాలయంలో జగనన్న కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

- జైభీమ్ సంస్థ వ్యవస్థాపకులు అవతారం

ప్రజాశక్తి - కౌతాళం

గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాకారులు స్ఫూర్తిని నింపాలని జై భీమ్ సంస్థ వ్యవస్థాపకులు అవతారం తెలిపారు. గురువారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 'అంబేద్కర్ ఆటపాట' నిర్వహించారు. ఎరిగేరి జడ్‌పిహెచ్ పాఠశాలలో క్రికెట్ పోటీలు, బదినేహల్ జడ్‌పిహెచ్ పాఠశాలలో ఖోఖో పోటీలు ప్రారంభించారు. జై భీమ్ వ్యవస్థాపకులు అవతారం, ఎరిగేరి ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, బదినేహల్ ప్రధానోపాధ్యాయులు హరినాక్షి రావు, వీరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అవతారం మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో ఉన్న విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, ప్రతి ఒక్కరికీ అంబేద్కర్ గురించి తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాము, మదిరే వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీనివాసులు, సుధాకర్ నాయక్, రమేష్, నరసింహులు, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న అవతారం

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- ఆదోని డిఎల్‌పిఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదోని డిఎల్‌పిఒ శ్రీనివాసులు తెలిపారు. గురువారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పెద్ద కమేల నుంచి చాకలి వీధి ఊరకుంట వరకూ జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇఒఆర్‌డి నగేష్, పంచాయతీ కార్యదర్శి సతీష్, అడ్వకేట్ చంద్రశేఖర్, సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.

కరువు నివేదికలు సిద్ధం

- జెడిఎ వరలక్ష్మి

ప్రజాశక్తి - దేవనకొండ

కరువు నివేదికలను సిద్ధం చేశామని కర్నూలు జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఎండిపోయిన ఆముదం, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో సుమారు 50 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. త్వరలోనే కరువు బృందం పర్యటిస్తుందని చెప్పారు. పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, ఎఒ సురేష్ బాబు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున పాల్గొన్నారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి హామీ కూలీలకు కరువు సహాయక చర్యల్లో భాగంగా తక్షణమే 200 రోజుల పని దినాలు కల్పించాలని, చేసిన పనులకు వెంటనే వేతనాలు చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో ఉపాధి పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం తీవ్రమైన కరువు పరిస్థితి ఏర్పడి నవంబర్ 1 నుంచి వలసలు ప్రారంభమయ్యాయని తెలిపారు. చాలామంది వంద రోజులు పూర్తి చేసుకున్న వారు ఇప్పటికీ ఇళ్ల దగ్గరే ఉన్నారని చెప్పారు. మరో ఐదు నెలలు గడవాలంటే మరో 100 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆదోని మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టి పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న మూడు వారాల ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శ్రీమఠంలో గద్వాల ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని తెలంగాణ రాష్ట్ర పరిధిలో గల గద్వాల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వసంత కుమార్ గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్, తహశీల్దార్ చంద్రశేఖర్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి నిజ బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి పటాన్ని అందజేశారు. శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, ఆధ్యాత్మిక అభివృద్ధి కార్యాలయ సిబ్బంది బిందుమాధవాచార్, విఆర్ఒ భీమన్న గౌడ్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి డాక్టర్‌గా అఫ్రో జహాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా అఫ్రో జహాన్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్) గురువారం బాధ్యతలు చేపట్టారు. చిప్పగిరి ప్రభుత్వ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జమీల్ అహ్మద్ విజయవాడలో పీజీ జనరల్ మెడిసిన్ చదవడానికి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో హిందూపురంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ అఫ్రో జహాన్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వహించి, మండలంలోని రోగులకు, గర్భిణులకు, బాలింతలకు సేవలందిస్తానని తెలిపారు. అలాగే తనతోపాటు సిబ్బంది కూడా సమయపాలన పాటించి 24 గంటలూ మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

I, GADIWAN ABDUL FEROZ (OLD NAME) S/O.GADIWAN SUBHAN R/O. H.NO:1/203/53, 2ND NGO'S COLONY, OPP: SMB FUNCTION HALL, ADONI, KURNOOL DIST, AP., I CHANGED MY NAME AS GADIWAN FEROZ HENCEFORTH I WILL BE KNOWN AS GADIWAN FEROZ

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జెడ్పి చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రైల్వేల ప్రయివేటీకరణను విరమించుకోవాలి

- సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డిమాండ్
- నంద్యాల, బేతంచెర్ల రైల్వే స్టేషన్‌ల ఎదుట ధర్నా

నంద్యాల రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

భారతీయ రైల్వేలను ప్రైవేట్‌పరం చేయడాన్ని తక్షణమే ఉపసంహరించు కోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైల్వేలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం నంద్యాల రైల్వే స్టేషన్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నాయకులు కెఎండి గౌస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి గుండెకాయ లాంటి రైల్వే రంగాన్ని ప్రైవేటుపరం చేయడమంటే ఆదాని, అంబానీకి దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడమేనని అన్నారు. లక్షల కోట్ల లాభాల్లో నడుస్తున్న రైల్వేలను ప్రైవేటుపరం చేయడానికి బిజెపి ప్రభుత్వం ఎందుకు అంత దూకుడుగా ముందుకు వస్తుందో ప్రజలు గమనించాలన్నారు. ముక్కలు ముక్కలుగా విభజించి కార్పొరేట్లకు అనుగుణంగా ప్రైవేటీకరణ చేయడం వల్ల సామాన్య ప్రజానీకానికి తీరని నష్టం కలుగుతుందని అన్నారు. 2014లో తొలిసారిగా ఎన్నికైన వెంటనే మోడీ ప్రభుత్వం ప్రయాణికుల చార్జీలను, రవాణా చార్జీలను పెంచిందని, సామాన్య ప్రయాణికుల చార్జీలకు ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేసిందన్నారు. రైల్వేలను ప్రయివేట్ వ్యక్తులకు, సంస్థలకు అప్పగిస్తే నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందనేది మోడీ తెలివి తక్కువ విధానమని విమర్శించారు. ప్రైవేటు చేయడం వలన రైల్వే భద్రత పెరుగుతున్న వాదన అసంబద్ధమన్నారు. దేశంలోనే ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్నో చోట్ల ప్రతి సంవత్సరం వందల కొద్ది పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం భద్రత విషయంలో డబ్బు మిగిలించుకునే విధానం వలన ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో 20 వేల మంది మరణించడం, ఎంతోమంది జీవితాంతం నయం కానీ వ్యాధుల బారిన పడడం, కొన్ని సంవత్సరాల క్రితం విశాఖపట్నంలోని దక్షిణ కొరియా ఎల్‌జి పాలిమర్స్ ఘటనలో 12 మంది దుర్మరణం, వెయ్యి మంది కార్మికులు అనారోగ్యం పాలయ్యారని, ఇవన్నీ ప్రైవేటు యాజమాన్యాల నిర్లక్ష్యం వైఖరికి ఉదాహరణలని అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాన్ని ఆపకుంటే దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాలు మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు మాట్లాడుతూ రైల్వే ప్రైవేటీకరణను కార్మికులు, ఉద్యోగులు ప్రజలు వ్యతిరేకించి ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు వి.బాల వెంకట్, పి.వెంకట లింగం, ఉపాధ్యక్షులు ఎం.నిర్మలమ్మ, శోభారాణి, నాయకులు భాస్కర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, డివైఎఫ్‌ఐ నాయకులు శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల : రైల్వే ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు వై ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బేతంచెర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో సిఐటియు పట్టణ నాయకులు మద్దిలేటి అధ్యక్షతన నిరసన చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్. మహమ్మద్ బాషకి వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు మద్దిలేటి స్వామి,రాజబాబు, బాష, రంగ నాయకులు, బుగ్గ రాముడు, పుల్లయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐదు సర్వేల్లోనూ సుబ్బారెడ్డి గెలవరని వచ్చింది

- ఆయన పోటీలో ఉంటే డిపాజిట్ కూడా రాదు
- మంత్రి బుగ్గనతో లోపాయికారి ఒప్పందం
- ధర్మవరం సుబ్బారెడ్డిపై కెఇ.ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు

ప్రజాశక్తి-డోన్

డోన్ నియోజకవర్గంలో ఐదు సర్వేలు నిర్వహిస్తే టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన ధర్మవరం సుబ్బారెడ్డికి గెలవరని వచ్చిందని, ఆయన ఎన్నడూ ఒక వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని, అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే ఎలా అవుతారని, అధిష్టానం ఆలోచించాలని మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కెఇ.ప్రభాకర్ పుట్టిన రోజు సందర్భంగా డోన్‌లో గురువారం అభిమానులు, కార్యకర్తలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మధు ఫంక్షన్‌హాల్‌లో భారీ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెఇ.కుటుంబానికి రాజకీయ ఓనమాలు నేర్పింది డోన్ అని అన్నారు. మా కుటుంబ రాజకీయ జీవితమంతా డోన్‌తో ముడిపడి ఉందన్నారు. ఒక్క పిలుపు ఇస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు వేలాది మంది ఈ రోజు కదిలివచ్చారని, అలాంటిది ఆర్థికమంత్రితో లోపాయికారి ఒప్పందం చేసుకున్న వారికి టికెట్ ఇస్తే ఎలా ఓట్లేస్తారని ప్రశ్నించారు. వార్డు మెంబర్‌గా గెలువలేని ఆయనకు మా అనుచరులెవ్వరు ఓట్లేయరని, డిపాజిట్లు కూడా రావని అన్నారు. అభిమానులంతా ప్రోత్సహిస్తే మీ వెంటే ఉంటామని చెప్పారు. కీర్తిశేషులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధర్మవరం సుబ్బారెడ్డిని భరించలేకనే పిడియాక్టు కింద కేసు పెట్టడం వాస్తవం కాదా, ఆయన జైల్లో ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అందరి ఇళ్లపై ఐటి దాడులు జరుగుతున్నాయని, సుబ్బారెడ్డి ఇంటిపై ఎందుకు జరగడం లేదనేది ఆలోచించాలన్నారు. ఆయన ఊర్లో ఒక కార్యకర్తను పోటీ పెడతామని, ఆయన మీద గెలిస్తే ఎమ్మెల్యే సీటు ఫ్రీగా వదిలిపెడతామని చెప్పారు. కోట్ల సుజాతమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు టిడిపి కార్యకర్తలకు సుబ్బారెడ్డి పెట్టిన వాతలు ఇంకా మరువలేదన్నారు. జగన్ పులివెందుల, చంద్రబాబునాయుడు కుప్పం ఎలా వదలరో కెఇ.ప్రభాకర్ డోన్ వదిలేది లేదన్నారు. మా అన్న ఆరుసార్లు గెలిచి, తాను రెండు సార్లు గెలిచి డోన్‌ను ఎలా వదులుతామనుకున్నారని అన్నారు. పోటీకి మా కుటుంబం సిద్ధంగా ఉందన్నారు. కెఇ.కృష్ణమూర్తి కూడా వస్తారన్నారు. రాజకీయానికి వయస్సుతో సంబంధం లేదన్నారు. కరువు మండలాలు ప్రకటించినప్పుడు టిడిపి డోన్ ప్రాంతం తప్పకుండా ప్రకటించే వారమని, ఆర్థికమంత్రి శాసనసభలో పిట్టకథలు చెప్పడం కాదని, నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో ఒక్కటి కూడా ఎందుకు కరువు మండలంగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టులకు బిల్లులు రాలేదని, అందుకే వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు. అంతకు ముందు పలువురు నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో నందికొట్కూరు ఎస్‌సి నియోజకవర్గం తప్ప అందరూ రెడ్లు ఉన్నారని, బిసిలకు అన్యాయం జరుగుతుందని, కెఇ.ప్రభాకర్‌కు డోన్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్‌పిటిసి కెఇ.జయన్న, టౌన్ మాజీ అధ్యక్షులు కెవి.ఫణిరాజు, మున్సిపల్ మాజీ వైఎస్ చైర్మన్ టిఇ. కేశన్న గౌడ్, మాజీ ఎంపిపి శేషఫణిగౌడ్, తొప్పెల శ్రీనివాసులు, అలెబాగు పరమేష్, అంబాపురం సర్పంచి శ్రీనివాసులు యాదవ్, బావిపల్లె సర్పంచి లింగన్న, లీగల్‌సెల్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసబట్టు, మాజీ సర్పంచులు శ్రీరాములు, రంగన్న, ఆదినారాయణ, నాయకులు సుధీష్, కిరణ్ యాదవ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు భూమానాగన్న, ధర్మవరం సంజీవుడు, చిట్యాల మద్దయ్యగౌడ్ తదితరుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్

428 జంటలకు కళ్యాణమస్తు, షాదీ తోఫా

- రూ. 3 కోట్ల 59 లక్షల 10 వేలు జమ : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద నాల్గవ విడత అర్హులైన 428 మంది జంటలకు రూ. 3 కోట్ల 59 లక్షల 10 వేలు జమ అయినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద ఈ ఏడాది జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,511 మంది అర్హులైన జంటలకు 81.64 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, మైనార్టీ ప్రభుత్వ సలహా దారుడు హబీబుల్లా, ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డిఆర్‌డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డిడి చింతామణి, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు విడతలలో 1674 మంది లబ్ధిదారులకు రూ. 13 కోట్ల 92 లక్షలు జమ చేశామన్నారు. నాలుగో విడతలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 71 జంటలకు రూ. 63 లక్షల 20 వేలు, బనగానపల్లిలో 80 జంటలకు రూ. 66 లక్షల 40 వేలు, నందికొట్కూర్‌లో 61 జంటలకు రూ. 53 లక్షలు, డోన్‌లో 61 జంటలకు రూ. 46 లక్షల 50 వేలు, నంద్యాలలో 67 జంటలకు రూ.58 లక్షల 80 వేలు, పాణ్యంలో 26 జంటలకు రూ. 19 లక్షల 45 వేలు, శ్రీశైలంలో 62 జంటలకు రూ.51 లక్షల 75 వేలు పెళ్లికూతుర్ల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల గురించి ఆలోచించే వ్యక్తి అని, ఈ మధ్యకాలంలో పెళ్లి అనేది ఎంతో కష్టతరమైన సందర్భంలో ప్రభుత్వం పేదల పెళ్లిళ్లకు పెద్ద పీట వేసి ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్సార్ కళ్యాణమస్తు, షాది తోఫాల కింద పేద జంటలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్ తదితరులు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- డిసెంబర్ 8 నుండి జరిగే సమ్మెను జయప్రదం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో డిసెంబర్ 8వ తేదీ నుండి నిరవధికంగా జరిగే అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం ఏ.నాగరాజు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రమేష్, శ్రీనివాసులు, ఐఎఫ్‌టియు నాయకులు చౌడప్ప పాల్గొని మాట్లాడారు. గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్స్ అనేక సేవలందిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనంతో జీవనం గడపడం చాలా కష్టంగా ఉందన్నారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హామీ ఇంతవరకు నెరవేర్చ లేదని చెప్పారు. 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాడ్యు టీ అమలు చేయాలని తీర్పునిచ్చినా రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీలు దశలవారీగా ఆందోళనలు చేసిన ఫలితంగా అధికారులతో చర్చలు జరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని, ఈ నేపథ్యంలో డిసెంబర్ 8 నుండి సెంటర్లన్నీ మూసివేసి నిరవధికంగా సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్టియు సంఘాల అనుబంధం అంగన్వాడీ యూనియన్లు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శోభారాణి, ఎం.నిర్మలమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి మద్దులు, కేఎండి గౌస్, జిల్లా కార్యదర్శులు బి బాల వెంకట్ లింగం, లక్ష్మణ్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఐఎఫ్‌టియు నాయకులు రఫీ, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు లలితమ్మ, తిరుపాలమ్మ, వసుంధర, సునీత, నాగరాణి, వెంకటమ్మ, ఆదిలక్ష్మి, సావిత్రి, భాస్కర్, ప్రతాప్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

25, 26వ తేదీల్లో 'గడప గడప'

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి

మాట్లాడుతున్న అంబటి గురువిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల :

కొలిమిగుండ్ల మండలంలో ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న చింతలాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రాఘవ రాజుపల్లి, చెన్నంపల్లి, మదనంతపురం గ్రామాల్లో, 26వ తేదీ చింతలాయపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు నంద్యాల ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు హాజరవుతారని చెప్పారు. ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డ్ మెంబెర్స్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలందరూ తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొలిమిగుండ్ల పిఎస్‌కు సిఐ హోదా

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌కు సిఐ హోదా కల్పిస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లాలో మొత్తం నాలుగు పోలీస్ స్టేషన్లో అప్ గ్రేడ్ చేయగా అందులో కొలిమిగుండ్ల పిఎస్ ఉంది.త్వరలో కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ అధికారిని నియమించనున్నారు.

గృహ నిర్మాణాలకు నాణ్యమైన సిమెంటునే ఉపయోగించాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గృహ నిర్మాణాలకు నాణ్యమైన సిమెంటునే ఉపయోగించాలని కాంట్రాక్టర్, టిడిపి నాయకులు నన్నేబై గారి జిలాన్ అన్నారు. గురువారం గృహ నిర్మాణాల్లో నాణ్యత గల జువారి సిమెంట్‌ను విరివిగా వాడినందుకు ఎస్ఎస్‌కే ఎంటర్ప్రైజెస్ నిర్వాహకులు శేఖర్ కాంట్రాక్టర్ జిలాన్‌కు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జిలాన్ మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునేవారు నాణ్యత ప్రమాణాలతో ఉన్న ముడి పదార్థాలను వాడాలని కోరారు.

బహుమతి తీసుకుంటున్న జిలాని

ప్రైమ్ 2.0ను రద్దు చేయాలి

- స్టాంపు రైటర్లు, వెండర్ వ్యవస్థను కొనసాగించాలి
- సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు

ప్రజాశక్తి - నంద్యాల

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైమ్ 2.0ను రద్దు చేయాలని, స్టాంపు రైటర్లు, వెండర్ వ్యవస్థను కొనసాగించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. ప్రైమ్ 2.0ను రద్దు చేయాలని స్టాంపు రైటర్లు, స్టాంప్ వెండర్లు చేపట్టిన దీక్షకు సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, కార్యదర్శి వర్గ సభ్యులు కెఎండి గౌస్, డి.లక్ష్మణ్, వెంకట లింగంలు గురువారం మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా పుల్లా నరసింహులు మాట్లాడుతూ స్టాంప్ రైటర్లు, స్టాంపు వెండర్‌లు వారి ఈ వ్యవస్థను నమ్ముకుని జీవనం గడుపుతున్నారని, వైసిపి ప్రభుత్వం ప్రైమ్ 2.0ను తీసుకొచ్చి వీరికి ఉపాధి లేకుండా చేశారన్నారు. ఈ జీవోను పూర్తిగా రద్దు చేసి పాత పద్ధతి విధానాన్ని కొనసాగించాలని కోరారు. రిజిస్టర్ విధానాన్ని సచివాలయం ద్వారా అమలు చేస్తానని చెప్పడం చాలా దారుణమన్నారు. సచివాలయం ద్వారా రిజిస్ట్రర్లు విధానం అమలయితే అవకతవకలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను అధికార పార్టీ చేతుల్లో పెట్టుకొని కొన్ని పనులను ప్రజలకు కాకుండా చేస్తున్నారని, మళ్ళీ ఈ రిజిస్టర్ విధానాన్ని సచివాలయం ద్వారా అమలు చేస్తే ప్రజల ఆస్తులకు గ్యారెంటీ ఉండదన్నారు. కావున పాత పద్ధతిని అమలు చేయాలని కోరారు. తక్షణమే ప్రైమ్ 2.0 విధానాన్ని రద్దు చేసి ప్రైమ్ 1.0 విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

స్టాంపు రైటర్లు, వెండర్‌ల దీక్షకు మద్దతు తెలియజేసి మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు

విరాళం అందజేస్తున్న వైసిపి మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

గంగమ్మ గుడి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని జిల్లెల్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి 35 వేల రూపాయలు విరాళంగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జిల్లెల్ల శంకర్ రెడ్డి, డొల్లు బాల తిమ్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

- లేబర్ అసిస్టెంట్ కమిషనర్ బస్రున్నిసా బేగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో 18 సంవత్సరాలలోపు బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ బస్రున్నిసా బేగం వివిధ షాపుల యాజమాన్యాలను హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీలోని కార్మిక శాఖ కార్యాలయంలో హోటళ్లు, బట్టలు షాపులు, మెకానిక్ షెడ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైల్డ్ లేబర్ ప్రొహిబిషన్ రెగ్యులేరేషన్ యాక్ట్ కింద పిల్లలను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఈ నెల 20 నుండి తనిఖీలు జరుగుతున్నాయని, డిసెంబర్ 10 వరకు జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు ట్రాస్క్‌ఫోర్స్ బృందం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ హోటళ్ళ, బట్టల షాపుల యజమానులు, మెకానిక్ షెడ్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

యజమానులతో మాట్లాడుతున్న లేబర్ అసిస్టెంట్ కమిషనర్

అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత : సబ్ డిఎఫ్ఓ

ప్రజాశక్తి - రుద్రవరం

అడవులను, వన్యప్రాణులను సంరక్షించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని రుద్రవరం అటవీ రేంజ్ సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. గురువారం రుద్రవరం సబ్ డివిజన్ ఫారెస్ట్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం రిజర్వ్ ఫారెస్ట్ నుంచి తిరుపతి శేషాచలం అడవుల వరకు ప్రభుత్వం గ్రీన్ కారిడార్‌గా ప్రకటించిందన్నారు. ఇందులో ఉన్న వృక్షజాతులు, వన్య ప్రాణులను అధికారులతో పాటు ప్రజలు కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అడవుల్లో ప్రస్తుతం పులులు జత కలిసే సమయం కావున ఎవరు అనుమతి లేకుండా లోపలికి వెళ్లరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల అనుమతితో వారి ఆధార్ కార్డులను చూపించి అడవుల్లోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నవంబర్ నుంచి డిసెంబర్ వరకు వన్య ప్రాణులకు ఆహారం, నీటి కొరత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమయంలో వన్య ప్రాణులు అటవీ ప్రాంత సమీపంలోని పంట పొలాలు, తాగునీరు, ఆహారం లభించే ప్రాంతాలలో సంచరిస్తుంటాయని చెప్పారు. ఈ సమయంలో రైతులు, ప్రజలు, బాటసారులు, భక్తులు వాటికి హాని తలపెట్టకుండా విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలన్నారు. వన్య ప్రాణులను చంపడం, వేటాడడం, ఉచ్చులు వేయడం, నాటు తుపాకులతో కాల్చడం లాంటి సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న దేవాలయాలకు వాహనాలలో వెళ్లే భక్తులు ప్లాస్టిక్ కవర్లు, ఇతర పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండడంతో వాటిని జంతువులు తిని మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. అడవుల సంరక్షణ కోసం ఫారెస్ట్ సిబ్బంది కాకుండా రుద్రవరం రేంజ్ పరిధిలో శీతల్, ఉట్ల, ఫారెస్ట్ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి ఒక్కో క్యాంపులో 5 మంది ప్రొటెక్షన్ వాచర్లను నియమించినట్లు తెలిపారు. చలమ రేంజిలో అక్కడక్కడ వెదురు, టేకు కలప అక్రమ రవాణా అవుతుందని తన దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఫారెస్ట్ సిబ్బంది అక్రమ వసూళ్ళకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే వెదురు సేకరణ జరిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న అధికారులు

సామాజిక సాధికార యాత్ర అంటే

మహిళలను నడి రోడ్డుపై కూర్చోబెట్టడమేనా..?

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

సామాజిక సాధికార యాత్ర అంటే మహిళలను నరి రోడ్డుపై కూర్చోబెట్టడమేనా అని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి మంత్రులు, నాయకులు చేసిన సామాజిక సాధికార యాత్ర అధికార అహంకార యాత్ర అని విమర్శించారు. సామాజిక న్యాయం ఎక్కడ ఉందని, బలవంతంగా మహిళలను సమావేశానికి తీసుకువచ్చి నడిరోడ్డుపై కూర్చోబెటాట్టరని అన్నారు. స్త్రీలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో పట్టణంలో పేదలకు పట్టాలు రాకుండా మాజీ ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శిస్తున్నారని, హైకోర్టులో ఎందుకు కేసును వేకేట్ చేయలేకపోతున్నారని ప్రశ్నించారు ఎస్ఆర్బిసి పక్కన తొలగించి మిగతా స్థలాలలో పేద ప్రజలకు పట్టాలివ్వాలని జిల్లా కలెక్టర్‌కు తాము లెటర్ అందజేశామని తెలిపారు. ఎమ్మెల్యే కార్యకర్తల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన ఇళ్ల స్థలాలను రెండు కోట్లకు అమ్ముకొని లబ్ధి పొంది ఎక్కడ తిరిగి ఆ మొత్తాన్ని ఇవ్వాల్సి వస్తుందోనని తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అన్ని సక్రమంగా ఉంటే కోర్టులో ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. 2014 ఎన్నికలకు మూడు నెలల ముందు 3 వేల ఇండ్ల పట్టాలు అధికారుల సంతకాలతో నకిలీవి పంపిణీ చేశారని, అవి నిజమైన పట్టాలయితే ఆ భూమి ఎక్కడుందో చూపించాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామ కృష్ణారెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణానాయక్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్ సాహెబ్, వేములపాడు గుర్రప్ప, తప్పెట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సామాజిక సాధికార యాత్రలో నడిరోడ్డుపై కూర్చున్న మహిళల ఫొటో చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే

అరెస్ట్ అయిన తమిళ కూలీలు

ఎర్రచందనం తమిళ కూలీలు అరెస్ట్

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలానికి సమీపంలోని తెలుగు గంగ ప్రధాన కాలువ వద్ద నంద్యాల డిఎఫ్ఓ వినీత్ కుమార్, రుద్రవరం రేంజర్ శ్రీపతి నాయుడుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి నలుగురు ఎర్రచందనం తమిళ కూలీలను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు డి వన సెంట్ సెక్షన్ ఆఫీసర్ ముక్తార్ బాషా తెలిపారు. మాట్లాడుతూ ఈ దాడుల్లో తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీలైన సెలవం ఇళయరాజా నన్ని, చంద్రన్ కొండన్, పొన్ను స్వామిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తిరుపతిలోని ఎర్రచందనం స్పెషల్ కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో మొబైల్ పార్టీ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, ఆయన సిబ్బంది, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ముక్తావలి, ఆర్ఓ, శ్రీనివాసులు, డివన సెంట్ సెక్షన్ సిబ్బంది, రేంజ్ సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

చైర్మన్ కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు నాగేశ్వరరావు

గుడిసె వాసులకు పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కర్నూలు రోడ్డు బి ఆర్ ఆర్ నగర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. గురువారం కర్నూల్ రోడ్డు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్‌లో జగనన్నకు చెపుదాం కార్యక్రమానికి వచ్చిన మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు గుడిసె వాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు చెందిన పేదలు దాదాపు 120 కుటుంబాలు సర్వే నెంబరు 589, 590, 595లో గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని వారందరికీ ఇంటి పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. స్పందించిన చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తక్షణమే కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని, నివాసం ఉన్న పేదలకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పకీరయ్య, మద్దిలేటి, సీతారాం, సుబ్బమ్మ, నారాయణ, గౌసియా, కృష్ణ, రాఘవేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందర్య వర్ల భవనం నందు రౌండ్ టేబుల్ సమావేశం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ప్రాజెక్టు) కార్యదర్శి మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మా బాష, వీరన్న, హెయిర్ బస్ యూనియన్ నాయకులు అంజయ్య, ఆటో యూనియన్ నాయకులు పరుష్, మా భాషలు మాట్లాడు తూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రమోషన్‌లో రాజకీయ జోక్యం అరికట్టాలి, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలన్నారు. గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఏ బిల్లులు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ రాజశేఖర్

రైల్వే రాయితీలను పునరుద్ధరించాలి

: ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి - బేతంచర్ల

కోవిడ్ సాకుతో సీనియర్ సిటిజన్స్, మహిళలు, వికలాంగులు, క్రీడాకారులకు, ఉపసంహరించిన రైల్వే రాయితీలను వెంటనే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బారాయుడు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఆర్.ఈశ్వరయ్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండలంలోని బుగ్గానిపల్లె తాండా గ్రామంలో మూడవరోజు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు సీతారాపురం వెంకటేశ్వర్లు అధ్యక్షతన కర్షక,కార్మిక, ప్రజాసంఘాల, సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా వి.సుబ్బారాయుడు, ఆర్.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆహార భద్రతకు హామీ ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలని, చారిత్రాత్మక కిసాన్ పోరాటం సందర్భంగా అమరులైన రైతుల కుటుంబ బాలకు పరిహారం చెల్లించి,పునరావాసం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటిని ఉపసంహరించుకోవాలని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను,అతని కుమారుడు ఆశీష్ మిశ్రాను ప్రాసిక్యూట్ చేయాలని,రీసర్వేలో జరుగుతున్న పొరపాట్లన్నింటిని సరి చేయాలి పేర్కొన్నారు. ప్రతి రైతుకు అతని భూమి వివరములు పాస్ బుక్ లో స్పష్టంగా పేర్కొనబడాలని, రిజిస్ట్రేషన్ ఒరిజినల్ డాక్యుమెంట్లు రైతుల వద్ద ఉండాలే తప్ప ఉద్యోగుల వద్ద ఉండరాదు అని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ అమలు కోసం నవంబర్ 27,28,తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయడానికి గ్రామంలోని కర్షకులు,కార్మికులు, అధిక సంఖ్యలో కదలి రావాలని వారు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బి.రాముడు, కేశలునాయక్, బి.రాజునాయక్, సిద్దయ్య, విజయ్ కుమార్, లక్ష్మీబాయ్, సంధ్యారాణి,రమాదేవి, అమ్మాజీ, అనిమిబాయ్, గోలినాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మాట్లడుతున్న జెవివి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి

సామాజిక అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - వెలుగోడు

విద్యార్థులు సామాజిక అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ పరిశుభ్రత పాటించడం వలన అనేక రోగాలను దూరం పెట్టవచ్చని, అలాగే గుండె గుండెపోటుకు సంబంధించి ప్రాథమిక చికిత్స ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా విద్యార్థిని విద్యార్థులచే స్వయంగా చేయించి చూపించారు. విద్యార్థిని విద్యార్థులు సాధారణ రోగాల నుంచి ఎలా తమని తాము ఎలా రక్షించుకోవాలో సునిశితముగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా జరిగేలా చూడడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రావు స్వయంగా పర్యవేక్షించి గౌరవ ముఖ్య అతిథులను సాదరంగా సభా వేదిక పైకి ఆహ్వానించి సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యాదాటి నాగేంద్రుడు, ఆవాజ్ కమిటీ మహమ్మద్ రఫీ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మొయినుద్దీన్, సీనియర్ ఉపాధ్యాయుని శ్రీమతి విశాలాక్షి, జన విజ్ఞాన వేదిక నెంబర్ వెంకటసుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యా యులు మహమ్మద్ ఫైజుల్లా వెలుగోడు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శేషారెడ్డి, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రగ్బీలో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఈనెల 21 నుండి 23వ తేదీ వరకు కర్నూలులోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీల్లో నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. డి.ఆయేషా సిద్దిక నర్సింగ్ రెండవ సంవత్సరం (ఎంపిహెచ్‌డబ్ల్యు) విద్యార్థిని, మొదటి సంవత్సరం సెరికల్చర్ చదువుతున్న బి ప్రశాంత్ వీరు ఇరువురు బాలికల, బాలుర కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారని, కర్నూలు జిల్లా జట్టు బాలికల బాలుర విభాగంలో 3వ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో ఎంపికకు కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా వైస్ ప్రిన్సిపల్ వన్నూర వలి ఇంకా బాగా కృషి చేసి కాలేజీకి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ రియాజుద్దీన్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే లబ్బి పుట్టినరోజు

ప్రజాశక్తి - నందికొట్కూరు

మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని సబ్ జైల్లో , ఖైదీలకు నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటే పోగు భాస్కర్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గం లబ్బి హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ప్రజలు ఆయనను మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ మల్లయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో దుద్యాల జిల్లా పరిషత్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్ర స్థాయిలో మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరచడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగన్న వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విశ్వనాథ్ ఆనంద్ ఈనెల 19 నుండి 21 వరకు చిత్తూరు జిల్లా బంగారు పాలెంలో నిర్వహించిన అండర్ 14 ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఫైనల్లో చిత్తూరు వర్సెస్ కర్నూల్ పోటీ పడగా చిత్తూరు జిల్లా జట్టు విన్నర్‌గా కర్నూలు జిల్లా జట్టు రన్నర్‌గా విజయం సాధించింద న్నారు. తమ పాఠశాలకు చెందిన విశ్వనాథ్ ఆనంద్‌కు స్టేట్ సర్టిఫికెట్, మెరిట్ సర్టిఫికెట్ రావడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థి విశ్వనాథ్ ఆనంద్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పలువురు అభినందించారు.

పాఠశాలలను డిప్యూటీ డిఇఓ తనిఖీ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దబోధనం, చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలను డిప్యూటీ డీఈవో మహబూబ్ బేగ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల పుస్తకాలను,గ్రేడింగ్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యాభివృద్ధికి కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఏఎస్ఓ దస్తగిరి రెడ్డి,ఎంఈఓ న్యాంతుల్లా,హెచ్‌ఎంలు కాత్యాయని,మహబూబ్ బాషా,సిఆర్‌పి కొండయ్యలు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

రెండు కోట్ల రూపాయలతో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం డోన్ పట్టణం లోని కొత్తబస్టాండ్ దగ్గర 2 కోట్ల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్ సిస్టంను సోమవారం రోజు సాయంత్రం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ఫ్లైఓవర్ వరకు ఫ్లైఓవర్ దిగిన తర్వాత అమ్మ హోటల్ నుంచి హైవే వరకు రెండు కోట్ల రూపాయలతో ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నామని,సుందరమైన రోడ్లు కంప్లైంట్ అయిపోయినాయని సెంట్రల్ లైటింగ్ సిస్టం తో పాటు డివైడర్ మధ్యలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండీ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్‌లు టీఈ.దినేష్ గౌడ్,ఆర్ట్ రమణ,వెంకటరాముడు, నాగేంద్ర, కోఆప్షన్ సభ్యులు వైఎస్అర్.రఫీ,బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, పట్టణయూత్‌అధ్యక్షులు రాజవర్ధన్, నాయకులు వంశీ,మున్సిపల్ డిఈ రసూల్,ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే వైసిపి లక్ష్యం అని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, కో ఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ అన్నారు. గురువారం పట్టణం లోని 11, 12వ వార్డుల పరిధిలో నూతనంగా నిర్మా ణం పనులు చేపడుతున్న సిసి రోడ్డు అభివృద్ధి పను లకు భూమి పూజ చేశారు. ముందుగా కాంట్రాక్టర్ కలిముల మున్సిపల్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యులను పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఈ సందర్భ ంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు 24 వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రతి నెలకు ఒకసారి కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా అభివృద్ధి పనులు చేపడుతు న్నామని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధికి కావలసినంత నిధులు మంజూరు చేస్తున్నారని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి తిమోతి, వార్డు కౌన్సిలర్లు మిట్ట కందల మహబతుల, బోర్వెల్ రహిమాన్, రంగస్వామి, షఫీ ఉల్లా, బోయశంకర్, వైసిపి నాయకులు, 15వ వార్డు సచివాలయ కన్వీనర్ షేక్ రఫీక్, వరాల మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ నిర్వహిస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా

ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : వైసిపి

పాములపాడు : జెండాను ఎగురవేస్తున్న రామలింగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

పాములపాడు : ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మండల వైసీపీ అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం నాడు పాములపాడు మండల కేంద్రంలో పల్లెకు వెళ్దాం కార్యక్రమం, జగనే రాష్ట్రానికి ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర రెడ్డి గ్రామానికి వచ్చిన ప్రభుత్వ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించి, పాములపాడు బస్టాండ్ సెంటర్లో వైసిపి జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు వచ్చాయని, ప్రతి ఒక్కరు జగనన్న ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు ఇన్చార్జి టిఎన్ఆర్ నాగరాజు, సర్పంచ్ మేకల భాగ్యమ్మ, ఎంపిటిసి రమాదేవి, మద్దూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, మిట్ట కందల సర్పంచ్ చింతల నారాయణ, చెలిమిల్ల ఎంపీటీసీ సురేష్, సొసైటీ డైరెక్టర్లు గోపాల్, బాల సుబ్బారెడ్డి, నాయకులు ఎల్వి రమణారెడ్డి, జబ్బారు, మాజీ సర్పంచులు బాలునాయక్, ఒబన్న గౌడ్, నాయకులు చౌడయ్య, ప్రభాకర్, పుల్లయ్య, హుస్సేన్, చరణ్, మహమ్మద్ గని, సోడా బాషా, ఎల్లా గౌడ్, గోవిందు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డు బైరెడ్డి నగర్‌లో 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని 15వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి అధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహత్ జబ్బార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్షపోగు ప్రశాంతి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ హాజరై లబ్ధిని వివరించే బోర్డును వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, వైఎస్ఆర్సీపీ పట్టణ ఉపాధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు లాలు, అబ్దుల్ రావుఫ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మార్కెట్ రాజు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మల్యాల గ్రామంలో సర్పంచ్ ఉమాదేవి, ఎల్లా నాయుడు, చంద్రశేఖర్, కే.శ్రీనివాసులు, ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ సీఎం జగన్ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రవి యాదవ్ పాల్గొని మల్యాల గ్రామానికి చెందిన సంక్షేమ పథకాల బోర్డును స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి,రవి, జడ్పిటిసి కలుమునిస, జెసిఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహాత్, జబ్బర్, నందికొట్కూరు బ్రాహ్మణ కొట్కూరు, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి,మద్దూరు సతీష్ రెడ్డి, బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, శాతన కోట సర్పంచ్ జనార్దన్ గౌడ్, ఉప సర్పంచ్ యేసు రత్నం, ఎంపిటి సిలు సురేష్ యాదవ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** జగనన్నతోనే రాష్ట్రాభివద్ధి సాధ్యం అవుతుందని, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె. సుధాకర్ రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో సర్పంచు షేక్ నాజియా, సూపరెండెంట్ సుబ్రమణ్యం అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పి. నాగలక్ష్మిరెడ్డి, కో–ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, వైసిపి నాయకులు రహంతుల్లా, నారాయణరెడ్డి, రమేష్ బాబు, మొల్ల బాషా, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి:** మండలంలో మాధవరం గ్రామంలో వైసీపీ మండల కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి బోరేటి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి,వైసిపి మండల కన్వీనర్ బోరా మల్లికార్జున్రెడ్డి పాల్గొని సంక్షేమ బోర్డును, వైసిపి జెండాను గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, గార్లదిన్నె సర్పంచ్ సీమ మనోహరమ్మ , చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. **చాగలమర్రి :** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగనన్న తోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని చాగలమర్రి మండల అధ్యక్షుడు వీర భద్రుడు, జిల్లా జెసిఎస్ అధ్యక్షుడు షేక్ బాబూలాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి నిర్వహించి వైసిపి జెండాను ఆవిష్కరించి సంక్షేమ పథకాల వివరాల జాబితాను విడుదల చేశారు. ఎంపీడీవో మహబూబ్ దోలా, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీటీసీ బేబమ్మ, మండల జెసిఎస్ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, పెద్ద వంగలి సర్పంచ్ బంగారు షరీఫ్, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు , విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, మండల కన్వీనర్ సన్నాల జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలుకూరు గ్రామం సచివాలయం–1లో జగనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల ఫ్లెక్సీలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోనేటి సుమలత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపీటీసీ లక్ష్మిదేవి, మండల్ లెవల్ ఆఫీసర్ మధుసూదన్, సచివాలయ కన్వీనర్ యం. సురేష్, పుల్లారెడ్డి, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అభివృద్ధి, సంక్షేమమే వైకాపా ప్రభుత్వ ధ్యేయమని విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. 9వ వార్డు సచివాలయ పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ వైసిపి ఇన్చార్జ్ గోపవరం నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాదం మరియమ్మ, కౌన్సిలర్ డాక్టర్ సుధామణి, నరసింహులు, మండల కో ఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, సచివాలయ కన్వీనర్ మర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, చింతకుంట మనోహర్ రెడ్డి, బండి లక్ష్మీ నరసయ్య, నాయకులు షేక్ నజీర్, గంధం చంద్రశేఖర్ రెడ్డి, షాదిఖానా కమిటీ చైర్మన్ ముల్లా అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు. **పేరాయిపల్లెలో :** మండల పరిధిలోని పేరాయిపల్లి గ్రామంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి నిర్వహించి మాట్లాడారు. మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల నాని సహకారంతో ఆళ్లగడ్డ మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో మహబూబ్ ఖాన్, గంగుల రామిరెడ్డి, గూబగుండం వెంకటసుబ్బారెడ్డి, యాదవాడ సర్పంచ్ నరసింహారెడ్డి, మండల ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ రామకృష్ణ. సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ గజ్జల రంగస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : మల్యాల గ్రామంలో..

ప్యాపిలి : సంక్షేమ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

టిడిపితోనే మహిళా సంక్షేమం : మాజీ ఎమ్మెల్యే

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

మహానంది : రాష్ట్రంలో మహిళా సంక్షేమం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని కొత్త కొట్టాలలో రెండవ రోజు జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి తిరిగి మహిళలకు, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడుప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, ఆర్ఎస్ గాజులపల్లె సర్పంచి అస్లాం భాష, గాజులపల్లె మహేశ్వర్ రెడ్డి, శశికళ కొండా రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాద్ రావు, మాజీ ఎంపిటిసి దస్తగిరి, జనార్ధన్ రెడ్డి, మౌళీశ్వర రెడ్డి, కృష్ణుడు, మహేశ్వర్ రెడ్డి, పాములేటి, మాబు తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే నాయకుడు చంద్రబాబు నాయుడు అయితే, జగన్ మాత్రం రాష్ట్ర ఆస్తులను దోచుకోవడానికి గ్యారెంటీ ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని పెద్దరాజుపాలెం, బద్రి నాయక్ తండా, కాలే నాయక్ తండాలలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేకు టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కష్ణా నాయక్ నాయకులు బాలకృష్ణ, ధనుంజయ నాయక్, కృష్ణా నాయక్, చిన్నరాజు పాలెం నరసింహులు, రామాంజనేయులుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. 2024 ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, లాయర్ నాగేంద్ర రెడ్డి, నాయకులు పసుపల బాల నాయుడు, షేక్షావలి, కామేష్, సిబి.కృష్ణుడు, మీరాపురం నాగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 26 వార్డు మల్లికార్జున్ రెడ్డి, మసాలా ఖాజా,ఆధ్వరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పరిపాలనలో అన్ని విధాలుగా నష్టపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే, చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిందేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి, జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపాలని అన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుం టూ, వాటి పరిష్కారానికి భరోసా ఇస్తూ, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణం 26 వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముత్తు, భూత్ ఇన్చార్జిలు డిష్ ముత్తు, లింగమయ్య, కార్యకర్తలు భరత్, అన్వర్ భాష, సలీమ్, తదితరు నాయకులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యా త్ రెడ్డి పాల్గొని ఇంటింటి కెళ్ళి టిడిపి పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అన్ని రంగాల్లో కుంభకోణాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, బాబయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, మోహన్, ముల్లా గఫార్, రియాజ్, ఆకుల ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

పారుమంచాలకు రోడ్డు మంజూరు

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండలంలోని చెరుకుచర్ల గ్రామం నుండి పారు మంచాలకు ఎన్నో ఏళ్ల తరాల తరాల నుండి రోడ్డు లేక అవస్థలు పడుతూ ఉంటే బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చొరవతో ఆరు కోట్ల వ్యయంతో నూతనంగా తారు రోడ్డు వేయడానికి మంజూరయ్యిందని బైరాపురం గ్రామ సర్పంచ్ రెడ్డి పని భూషణ్ రెడ్డి, తిమ్మాపురం గ్రామ సర్పంచ్ సామిరెడ్డి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరాల నుండి మా గ్రామాల నుండి పారుమంచాలకు వెళ్లాలంటే ప్రజలు వ్యవసాయ కూలీలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్ళని ప్రభుత్వం నుండి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆరు కోట్ల రూపాయలు నూతనంగా తారు రోడ్డు వేయడానికి మంజూరు చేయించారని దీంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తురన్నారు.

హోరాహోరీగా.. అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ పాఠశాలలో గత రెండు రోజులుగా 67వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్ –19 బాలురు, బాలికల ఖోఖో ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం ఖోఖో బాలుర విభాగంలో కర్నూలు, శ్రీకాకుళం, కడప, విశాఖపట్నం, నెల్లూరు, ప్రకాశం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కి చేరుకున్నాయి. అలాగే బాలికల విభాగంలో కర్నూలు, విశాఖపట్నం, విజయ నగరం, నెల్లూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్ కి చేరుకున్నాయి. శుక్రవారం ఖోఖో ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. క్రీడా పోటీల అబ్జర్వర్ సీతారామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రతాప్, దాదాపీర్, కరస్పాండెంట్ ప్రజ్ఞా నరసింహారెడ్డి, కె.వి సుబ్బారెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్ మల్లేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE NANDYAL
I.A.No. 2384/2019 IN O.S. No. 93/2010

Basineni Chenna Kesalu. ...Petitioner/Plaintiff

-Vs-

1)Gopavaram Ramatheertham Reddy and others ...Respondents/Defendants

NOTICE TO RESPONDENT No 12/ PROPOSED DEFENDANT No.12

Address:
Gopavaram Jyothamma,
D/o Lare Sanga Siva Nagi Reddy,
Wo Gopavaram Ramatheertham Reddy,
Hindu, aged about 40 years,
R/o H.No. 27-222-1-10, Bommalasatram,
Nandyal Town, Kurnool District.

పై నెంబర్ దావా యందు 8వ ప్రతివాది అయిన సంగ శివ నాగిరెడ్డి చనిపోయినందున అతని వారసులను ప్రతివాదులుగా చేర్చుటకు పై అర్జిని వాడి దాఖలు చేయడమైనది. సదరు వారసులను చేర్చు ఆర్జి నందు respondent No.12 defendant No. 12 అయిన మీకు పై ఆర్జి నందు మీ నోటీసులకు గాను 04-12-2023వ తేదిన పై ఆర్జి వాయిదా ఉన్నది. కావున respondent No. 12/defendant No.12 అయిన మీరు పై అర్జి యందు 04-12-2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట కుద్దుగా గాని, వకీలు ద్వారా గాని, హాజరు అయి పై యొక్క ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షంగా పై అర్జిని కోర్టు వారు తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియ చేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా :04-12-2023

S.M.Subhani,
K.Venkoba Rao,
Nandyal Town,
Cell No: 9963920866
Advocates for Petitioner Plaintiff.